నమస్తే తెలంగాణ
జనగామ
3 | వరంగల్, శనివారం 7 డిసెంబర్ 2024 | JANAGAON

జనగామలోని ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

‘పల్లా’ నిఖార్సైన నాయకుడు

- జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ ప్రశంసలు
- ఆయన అజాత శత్రువు అంటూ కితాబు
- కొట్లాట వద్దు కలిసి పనులు చేద్దాం
- జనగామలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు

జనగామ, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ‘ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వచ్చాడు.. అక్కడ ఏ ఇబ్బందీ లేదు.. ఒక్క జనగామ నియోజకవర్గంలో మాత్రమే మాకు సమస్య ఉంది.. అన్న(ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి) మా పార్టీలోకి రాడు.. ఎందుకంటే ఆయన నిఖార్సైన బీఆర్ఎస్ నాయకుడు.. నేను కూడా ఆ పార్టీలో పనిచేసినప్పుడు వ్యక్తిత్వం అంటే ఏంటో బాగా తెలుసు.. అజాత శత్రువు.. నెమ్మదస్తుడు.. కొట్లాడే వ్యక్తి కాదు.. ఆయన కొట్లాట పెట్టుకునేటోడైతే నేను కూడా కొట్లాట పెట్టుకుందామని చూస్తా.. కానీ రాజేశ్వర్‌రెడ్డిలో కలుపుకొని పోయే వ్యక్తిత్వం ఉంది కాబట్టి మేం కూడా కలిసిపోయి కార్యక్రమాలు చేయాలని నిర్ణయానికి వచ్చాం’ అని రాష్ట్ర ఆటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.

జనగామ జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ‘మొదట్లో జనగామ పర్యటనకు వచ్చినప్పుడు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉండేది.. ఎందుకంటే మా పార్టీ అభ్యర్థి ఓడిపోవడం, రాజేశ్వర్‌రెడ్డి గెలవడం వల్ల గతంలో ఇన్‌చార్జిలు కార్యక్రమాలను నడిపించారు. ఇప్పుడు వాళ్లే నడిపిస్తారని మా నాయకుడు చెప్పాడు’ అని అన్నారు. అయితే ప్రజల విషయానికి వచ్చినప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో స్థానిక ఎమ్మెల్యేను ఇబ్బందులు పెట్టుకుంటూ.. మనం ఇబ్బందులు పడితే బాగుండదని అభివృద్ధి పనుల విషయంలో పార్టీ ఇన్‌చార్జి అభిప్రాయాలు తీసుకుంటాం కానీ అధికారిక కార్యక్రమాలను సాఫీగా నడిపిద్దామని.. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సముదాయించామని మంత్రి సురేఖ చెప్పారు. ఇక నుంచి అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని కలెక్టర్‌కు చెప్పామని, పార్టీలపరంగా వెళ్తే అధికారులు ఇబ్బందులు పడొద్దని ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇక ముందు అభివృద్ధి, సంక్షేమం విషయంలో దయచేసి మీరు(పల్లా) కూడా అందరినీ కలుపుకొని పోవాలి అని మంత్రి విజ్ఞప్తి చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచకుండా వచ్చిన వెంటనే లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా తొందరగా పంపిణీ చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బ్యాంకుల్లో వేసుకొని పిల్లలు, కుటుంబం కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఆలయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని.. ప్రాధాన్యతాక్రమంలో రాజకీయాలకు తావులేకుండా ప్రతి నియోజకవర్గంలో రెండు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని స్థానిక ఎమ్మెల్యేకు మంత్రి సురేఖ సూచించారు. నియోజకవర్గంలోని బచ్చన్నపేట, జనగామ, నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన మొత్తం 225 మంది లబ్ధిదారులకు చెక్కులను మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, స్థానిక వార్డు కౌన్సిలర్ పేర్ని స్వరూప, జనగామ ఆర్డీవో గోపీరాం తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

ఆగ్రహాజ్వాల

- ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు
- హైదరాబాద్ వెళ్లకుండా పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డగింత

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 6 : బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డిల అక్రమ కేసులు, అరెస్టులకు నిరసనగా హైదరాబాద్ నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి తరలివెళ్తుండగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్న నియంతృత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నించే నాయకులను నిర్బంధించడం, నిరసన తెలుపకుండా అడ్డుకోవడం ముఖ్యమంత్రి రేవంత్‌కు తగదని మండిపడ్డారు. ప్రజాహక్కులను కాలరాస్తున్న సర్కారుకు త్వరలో ప్రజలే గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు వచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కారు అక్రమ అరెస్టులతో ప్రజలను మభ్యపెడుతున్నదని విమర్శించారు. పాలనను గాలికొదిలేసి బీఆర్ఎస్ నాయకులను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నదని పేర్కొన్నారు. అరెస్టులు, నిర్బంధాలు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, వాటికి బెదరమని స్పష్టం చేశారు.

ములుగు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

రాయపర్తి, జనగామ అర్బన్ పీఎస్‌లో అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

గిరిజన యూనివర్సిటీకి రూ.890 కోట్లు విడుదల

ములుగు రూరల్, డిసెంబర్ 6: ములుగు జిల్లాకేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కోసం కేంద్రప్రభుత్వం రూ.890 కోట్లు విడుదల చేసింది. పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన కేంద్రం ఈమేరకు నిధులు కేటాయించింది.

ఆరు గ్యారెంటీల కోసం మరో ఉద్యమం

- హైడ్రా, మూసీ పేరుతో ప్రజా సమస్యలు పక్కదారి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజం

ఏటూరునాగారం, డిసెంబర్ 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కన బెట్టి హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఏటూరునాగారంలో జిల్లా ద్వితీయ మహాసభలను ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేస్తామని పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని, కనీస వేతనాలను పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీ మిడియం బాపురావు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వాలు సహజ వనరులను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, పిట్టల రవి, బి.సాంబశివ, రత్నం రాజేందర్, దావూద్, కొప్పుల రఘుపతి, వాసు, సౌమ్య, వంకరాములు, చిరంజీవి, సుధాకర్, ఐలయ్య, గఫూర్, చిట్టిబాబు, మల్లారెడ్డి, చిటమట రమేశ్, యాకూబ్, ప్రసాద్ పాల్గొన్నారు.

- ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు ఉధృతం చేయాలి
- ఆరు గ్యారెంటీల అమలు కోసం మరో ఉద్యమం తప్పదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఇదేం ‘చెత్త’ బీరు..?

ఇనుగుర్తిలో వైన్స్ ఎదుట మద్యంప్రియుల ఆందోళన

ఇనుగుర్తి, డిసెంబర్ 6 : కేఎఫ్ లైట్ బీర్లలో చెత్తా చెదారం ఉందంటూ మద్యంప్రియులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఇనుగుర్తి మండలకేంద్రంలోని లక్ష్మీ వైన్స్‌లో కొందరు యువకులు బీర్లు కొనుగోలు చేయగా, సీసా అడుగున చూసి ఖంగు తిన్నారు. చెత్తాచెదారమో.. లేక పురుగు అవశేషమో ఉన్నదని, ఇదేమిటని యజమానిని ప్రశ్నించినా దాటవేస్తున్నాడని మండిపడ్డారు. సీసాలను పరిశీలించకుండా విక్రయిస్తున్న వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై మురళీధర్‌రాజ్ సముదాయించడంతో ఆందోళన విరమించారు.

షాపు ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు



బీరు సీసాలో ఉన్న చెత్తా చెదారం (వృత్తంలో)

యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని షాక్‌కు గురిచేశాయి. ఉమ్మడి జిల్లాలో కీలకమైన హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో తమ అనుచరులను గెలిపించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేసినా వారు ఓడిపోవడంతో ఖంగుతిన్నారు. వరంగల్‌లో కొండా సురేఖ అనుచరుడు బత్తిని నిఖిల్‌ను కాదని సాధారణ కార్యకర్త పరమేశ్వర్‌కు విజయం కట్టబెట్టడం, హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని అనుచరుడు సతీశ్‌కు బదులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుమారుడు దిలీప్ గెలవడం జీర్ణించుకోలేకపోతున్నారు. అనూహ్య పరిణామాలతో నైరాశ్యంలో పడిపోయిన ఆ ఇద్దరు.. అధికారంలో ఉండి కూడా ఇలా ఓడిపోవడం ఏమిటని మదనపడుతున్నారు. అంతేగాక మొదటి నుంచీ నాగరాజు కుమారుడు బరిలో ఉండడంపై గుర్రుగా ఉంటూ వచ్చిన నాయినికి తాజా ఫలితం మింగుడుపడకపోగా ఇద్దరి మధ్య దూరం పెంచినట్లయింది.**

- వరంగల్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

షాక్‌లో సురేఖ, నాయిని

అలా ఎలా ఓడిపోయారు..?

- యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు
- రెండు జిల్లాల్లోనూ వీరి అనుచరుల ఓటమి
- ఊహించని పరిణామంతో ఖంగుతిన్నవైనం
- ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు మధ్య మరింత దూరం

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇటీవల అన్ని జిల్లాల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించింది. యూత్ కాంగ్రెస్‌లో జిల్లా, నియోజకవర్గ అధ్యక్ష పదవులకు ఆన్‌లైన్ ఓటింగ్ విధానంలో ఈ ఎన్నికలు జరిగాయి. రెండు నెలలుగా సభ్యత్వ నమోదు, పోలింగ్ ప్రక్రియ జరుగుతూ వచ్చింది. రెండు రోజుల క్రితం ఎన్నికల ఫలితాలను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. వరంగల్, హనుమకొండ జిల్లాల యువజన కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నికలో ఆ పార్టీలోని కీలక నేతలకు షాక్ ఇచ్చాయి. దేవాదాయ మంత్రి కొండా సురేఖ, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు ఈ ఎన్నికలో ఓడిపోయారు. ఉమ్మడి వరంగల్ పరిధిలోని రెండు కీలక జిల్లాల్లో ప్రస్తుత ప్రజాప్రతినిధులకు ఈ ఫలితాలు ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నాయిని రాజేందర్‌రెడ్డికి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు మధ్య యూత్ కాంగ్రెస్ ఎన్నికలతో విభేదాలు మొదలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన కేఆర్ నాగరాజు కుమారుడు హనుమకొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేయడంపై నాయిని రాజేందర్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో రాజేందర్‌రెడ్డికి, కేఆర్ నాగరాజుకు మధ్య దూరం మరింత పెరిగింది. మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో అక్కడి ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు మద్దతు ఇచ్చిన వారే యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా గెలిచారు.





కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల ఫలితాలు ఆ పార్టీ కీలక ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తెచ్చాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారి అనుచరులపై ఆ పార్టీలోని సాధారణ కార్యకర్తలు విజయం సాధించడంతో ముఖ్య నాయకులకు రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేసిన మంత్రి కొండా సురేఖ అనుచరుడు బత్తిని అఖిల్‌పై మూడు వేల ఓట్ల ఆధిక్యంతో పరమేశ్వర్ గెలిచారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు సతీశ్ హనుమకొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేశాడు. ఈ ఎన్నికలో సతీశ్‌పై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుమారుడు కేఆర్ దిలీప్ 4వేల ఓట్ల తేడాతో గెలిచారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తమ అనుచరుల గెలుపు కోసం బాగా కష్టపడ్డారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. తమ అనుచరులను గెలిపించాలని, పార్టీలో అందరికీ అవకాశాలు వచ్చేలా చూస్తామని చాలా మందికి హామీలు ఇచ్చారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మంత్రి కొండా సురేఖ అనుచరుడు బత్తిని అఖిల్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు సతీశ్ ఓడిపోయారు. సొంత జిల్లాల్లో తమ అనుచరులను పోటీలో దింపి, స్వయంగా ప్రచారం చేసినా ప్రతికూల ఫలితాలు రావడంపై ఇద్దరు ముఖ్యనేతలు తట్టుకోలేకపోతున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అధికార పార్టీలో తమకు వ్యతిరేక ఫలితాలు రావడం ఏమిటని ఆలోచిస్తున్నారు. తక్కువ సమయంలోనే పార్టీ పరంగా ఇద్దరు ముఖ్యనేతలపై అసంతృప్తి ఉందని యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి.

అధికార పార్టీకి తొత్తులుగా పోలీసులు

- ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు
- ప్రతి కేసుపై కౌంటర్ వేస్తాం
- పరిధి దాటిన వారికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబర్6: అధికార కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. నర్సంపేటలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉంటే అనేక మందిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తే బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి అర్ధరాత్రి జైలుకు పంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఒకవేళ ఎవరైనా చట్టాన్ని వ్యతిరేకిస్తే 41 సీఆర్‌పీ కింద నోటీసులిచ్చి విడుదల చేయాలని, కానీ పోలీసులు అధికార పార్టీకి అండగా ఉంటూ కుట్రపూరితంగా తప్పుడు కేసులు బనాయించడమేంటని ప్రశ్నించారు. ఏడేండ్ల శిక్షకు లోబడి ఉంటే స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి ఉండగా జైలుకు ఎలా పంపుతారన్నారు. అంతేగాక 80 ఏండ్ల వృద్ధుడిపై కేసు పెట్టడంపై పోలీసులకు చట్టాలపై అవగాహన ఉందా, లేకుంటే ఈ వ్యవస్థను ఏం చేద్దామనుకుంటున్నా రని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులను నివాళులర్పించుకోలేని దౌర్భాగ్య పాలన కొనసాగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. ఇలాంటి ఘటనలపై నర్సంపేటలో న్యాయవాదులు నవ్వుతున్నారని, పోలీసుల తీరును బార్ అసోసియేషన్ సైతం ఖండించిందటే ఆ శాఖ పనితీరు ఎలా ఉందో ఊహించుకోవచ్చునన్నారు. డివిజన్‌లో జరుగుతున్న పోలీస్ అరాచకాలపై సీపీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు మాత్రం శూన్యమన్నారు. మెడికల్ కాలేజీని మంజూరు చేసి నిర్మాణం చేసిన తననే ప్రారంభోత్సవం నాడు అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతి కేసుపై కౌంటర్ కేసులు వేస్తున్నామని, పరిధి దాటిన వారికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు

ఏం సాధించిందని విజయోత్సవాలు

- ప్రజలను తప్పదోవ పట్టించేందుకే పెద్దపల్లిలో సభ
- హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- ఆ పార్టీ నాయకుల ఎస్కార్ట్‌కే పోలీస్ స్టేషన్లు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మహదేవపూర్(కాటారం), డిసెంబర్ 6 : ఏడాదిలో ఏం సాధించిందని కాంగ్రెస్ విజయోత్సవాలు నిర్వహిస్తున్నదని మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. కాంగ్రెస్ వంచన దినాల్లో భాగంగా శుక్రవారం కాటారంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలిచ్చి వాటిని విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పోరాటంతోనే కొద్దో గొప్పో రుణ మాఫీ చేశారని, లేకుంటే అది కూడా చేసేవారు కాదని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లు ప్రజలకు రక్షణగా లేవని, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెపితేనే దరఖాస్తులు తీసుకుంటున్నారని, వాళ్లకు పైలట్‌లు, ఎస్కార్ట్‌లు పెట్టేందుకే అవి పనిచేస్తున్నాయని విమర్శించారు. సీఎం సభ కోసం రూ.100 కోట్లు ఖర్చు చేసి పెద్దపల్లిలో భారీ సభ పెట్టి రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉన్నరని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని తెలిపారు.

దోపిడీ దొంగలు దొరికారు

- ఎస్‌బీఐ రాబరీలో ముగ్గురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో నలుగురు
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా

స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిశోర్‌ఝా

సుబేదారి, డిసెంబర్6: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో సంచలనం రేపిన ఎస్‌బీఐ దోపిడీ ఘటనలో దొంగలు దొరికారు. ఏడుగురు ముఠాలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝా వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ షెహవాజ్ పూర్‌కు చెందిన అర్షద్ అన్సారీ, బుడాన్‌వాసి షాఖీర్‌ఖాన్, బుల్దనా జిల్లా మోటల గ్రామస్తుడు హిమాన్షు బిగాంచంద్ జాన్వర్, బదోన్ జిల్లా కక్రలాకు చెందిన మహమ్మద్ నవాబ్ హసన్, బడాయు జిల్లా కక్రలా గ్రామవాసి సాజిద్‌ఖాన్, మహారాష్ట్ర చికిల్లి తాలుకా సైగావ్ గ్రామానికి చెందిన అక్షయ్ గజానన్, ముల్దానా జిల్లా పుణె మోటాలవాసి సాగర్ భాస్కర్ గోర్ కలిసి బ్యాంకుల దోపిడీకి ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా హైదరాబాద్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని గూగుల్ ద్వారా బ్యాంకుల సమాచారాన్ని సేకరించే క్రమంలో రాయపర్తిలోని ఎస్‌బీఐలో దోపిడీ చేయడానికి అనువుగా గుర్తించారు. నవంబర్ 18న అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరి రాయపర్తి శివారుకు చేరుకుని, డ్రైవర్ హిమాన్షును తెల్ల వారుజామున నాలుగు గంటలకు రమ్మని కారును వెనక్కి పంపించారు. అక్కడి నుంచి పంట పొలాల నుంచి బ్యాంకుకు వెళ్లి కిటికీ పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. సెక్యూరిటీ అలారం సౌండ్ రాకుండా, సీసీ కెమెరాల్లో కనిపించకుండా వైర్లు కట్ చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూం తాళాలను పగలగొట్టి వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో మూడు లాకర్లను తొలగించి, అందులో ఉన్న రూ. 13కోట్ల 61లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గ్యాస్ సిలిండర్, ఇతర సామగ్రిని బ్యాంకులో వదిలిపెట్టి తిరిగి కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. మరునాడు ఏడు వాటాలు పంచుకొని మూడు బృందాలుగా విడిపోయి, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు వెళ్లారు. పోలీసులు అత్యాధునిక టెక్నాలజీ సాయంతో యూపీకి చెందిన అర్షద్ అన్సారీ, షాఖీర్‌ఖాన్, హిమాన్షును పట్టుకొని 2.520 కిలోల బంగారం, కారు, రూ. పదివేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు. ఈ ముఠా రాత్రి వేళ సెక్యూరిటీ గార్డు లేని బ్యాంకులను టార్గెట్ చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో ప్రతిభ చూపిన డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీలు నర్సయ్య, బోజరాజు, కిరణ్ కుమార్, ఆత్మకూరు, రఘునాథపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, నర్మెట్ట, టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని సీపీ అభినందించారు.

పాలకుర్తి కాంగ్రెస్‌లో కొట్లాట

- ఎమ్మెల్యే అనుచరుడికే యూత్ అధ్యక్ష పదవులు కట్టబెట్టారని ఆరోపణలు
- పార్టీ నియమావళికి విరుద్ధంగా ఎన్నికలు జరిగాయని విమర్శలు
- సోషల్ మీడియా వేదికగా అభ్యర్థుల మండిపాటు

పాలకుర్తి, డిసెంబర్ 6: పాలకుర్తి కాంగ్రెస్‌లో యూత్ కొట్లాట జరుగుతున్నది. ఎమ్మెల్యే అనుచరుడికే యూత్ అధ్యక్ష పదవులు కట్టబెట్టారని సోషల్ మీడియా వేదికగా బహిరంగ విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. పార్టీ నియమావళికి విరుద్ధంగా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. తాను 1800ల సభ్యత్వాలు చేయించానని, ప్రతి సభ్యత్వానికి రూ.50 చెల్లిస్తే కేవలం 166 మాత్రమే పోలైన ఓట్లు చూపెట్టడం ఆశ్చర్యమేసిందని యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసిన ఓ అభ్యర్థి వాపోయాడు. పాలకుర్తి నియోజకవర్గం లో అన్‌హోల్డ్‌లో 3758, తిరస్కరించినవి 1721 మొత్తం 5479 సభ్యత్వాలు చెల్లకుండా పోయాయని ప్రకటించడం మోసపూరితమని పేర్కొన్నాడు. యూత్ కాంగ్రెస్ ఎన్నికలు పార్టీ నియమావళికి విరుద్ధంగా జరిగాయని అభ్యర్థి పసులాది ప్రశాంత్ పేర్కొన్నాడు. తాను సుమారు 3.50 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కుట్రపూరిత రాజకీయాలు చేస్తే కాంగ్రెస్ బతకడం కష్టమని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.